# మూర్ఖపు తాబేలు



అనగనగా ఒక అడవిలో ఉన్న చెరువులో కంచుగ్రీవుడు అని ఒక తాబేలు ఉండేది. దానికి కొన్ని హంసలు స్నేహితులుగా ఉండేవి. కొద్ది కాలానికి ఆ ప్రాంతంలో తీవ్రమయిన దుర్భిక్షం ఏర్పడింది. చెరువు ఎండిపోసాగింది. అప్పుడు హంసలు ఆ చెరువుని వదిలి పెట్టి ఇంకెక్కడికయినా వెళ్ళి ఆహారం సంపాదించుకుందాము అని నిశ్చయించుకున్నాయి.

ఆ మాటే తాబేలుతో చెప్తే "నన్ను కూడా మీతో పాటు తీసుకుని పోండి. నేను ఒక్క దానిని ఇక్కడ ఉండలేను" అని అంది. అప్పుడు ఆ హంసలు ఏం చెయ్యాలా అని ఒక ఉపాయం ఆలోచించి రెండు హంసలు ఒక కఱ్ఱపుల్లని అటు ఇటు ముక్కులతో పట్టుకుని ఎగిరేటట్టు, ఆ కఱ్ఱపుల్లని పట్టుకుని తాబేలు తమతో పాటు వచ్చేటట్టు ఆలోచించి తాబేలుకి చెప్పాయి. అందుకు తాబేలు కూడా అంగీకరించింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

సరే ఇక బయలుదేరతారనగా, హంసలు తాబేలు ఇలా హెచ్చరించాయి
" మిత్రమా ! మార్గములో పల్లెలు, పట్టణాలు వస్తాయి. ఆకాశంలో వెళ్తున్న మనల్ని చూసి కింద జనం కేకలు వేసి తప్పట్లు కొడతారు. నువ్వు మాత్రం నోరు తెరవవద్దు. అలా తెరిస్తే కింద పడి చచ్చిపోతావు".
తాబేలు అప్పటికి సరే అంది.

హంసలు రెండూ ఒక కఱ్ఱపుల్లని తమ ముక్కులతో పట్టుకోగా , తాబేలు ఆ కఱ్ఱపుల్లని పట్టుకుని ఆకాశంలో వెళ్తూ ఉండగా మన తాబేలుకి కింద చెట్లు చేమలు ఇళ్ళు మనుషులు అంతా విచిత్రంగా, తమాషాగా కనిపిస్తున్నాయి.

అలా ఒక పట్టణం మీద నుంచి ఎగురుతూ ఉండగా కింద ఉన్న పిల్లలు "అబ్బో ఆకాశంలో తాబేలు ఎగురుతోంది, ఆకాశంలో తాబేలు ఎగురుతోంది, ఆకాశంలో తాబేలు ఎగురుతోంది" అని గట్టి గట్టిగా కేకలు వెయ్యటం మొదలు పెట్టారు.

మన తాబేలు కి ఆ పిల్లలు ఏమంటున్నారో అని ఆత్రం ఎక్కువ అయ్యి హంసలు చెప్పిన సంగతి మర్చిపోయింది.

"పిల్లలు ఏమంటున్నారు" అని హంసలని అడగాలని నోరు తెరవగానే ఆకాశంలో అంత పైనుంచి నేల మీద పడి చచ్చిపోయింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

చూశారా మరి పిల్లలూ మన కన్నా తెలివిగల వాళ్ళు, పెద్ద వాళ్ళు చెప్పిన మాట వినాలి. మూర్ఖంగా ప్రవర్తిస్తే తాబేలుకి పట్టిన గతే మనకీ పడుతుంది అన్న మాట.

Keywords: Telugu Sahityam, Telugu lo chinna pillala kathalu, bala sahityam, mUrkhapu tAbElu katha, hamsa tAbElu katha, neeti kathalu, telugu lo bala saahityam

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org



PDF created with pdfFactory trial version www.pdffactory.com